# ప్రజాశక్తి

శుక్రవారం 11 నవంబర్ 2022






## గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను గడువు తేదీలోగా పూర్తిచేసి, గృహప్రవేశాలకు చర్యలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని కృష్ణపల్లి లేఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించి పనులు త్వరిగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ చిరంజీవులను ఆదేశించారు. అనంతరం గ్రామసచివాలయాన్ని సందర్శించి, రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టార్‌ను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసచివాలయ నూతన భవనాలను, ఆర్‌బికెల పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ బోనురామినాయుడును కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు మహా ప్రదర్శన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు ; నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

- అనుమతులు లేవనే నెపంతో ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- 11 మంది రైతు, గిరిజన సంఘాల నాయకుల అరెస్టు, విడుదల
- పాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ

***పంటలకు మద్దతుధర ఇవ్వాలని, జిల్లాలో సాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు అడ్డంకులు సృష్టించి నాయకులను అరెస్టు చేసినా రైతులు తమ ర్యాలీని కొనసాగించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు.***

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, జంఝావతి, అడారుగెడ్డ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, గుమ్మిడిగెడ్డ, రాళ్లగెడ్డ తదితర గెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మించి సాగునీటి సదుపాయాన్ని మెరుగుపర్చాలని, వెంగళరాయ, వట్టిగెడ్డల్లో షిల్టు తీసి నీటి సామర్ధ్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన రైతు మహాప్రదర్శన తలపెట్టాయి. అయితే ర్యాలీకి నుమతుల్లేవన్న నెపంతో పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీను, నాయకులు భాస్కరరావు, కరణం రవీంద్ర, కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, రామును అరెస్టు చేశారు. అయినప్పటికీ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు ఆధ్వర్యంలో రైతులు ర్యాలీని కొనసాగించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ తమది రైతు ప్రభుత్వమని వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇంతవరకు రైతుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి ఏమీ చేయలేదని విమర్శించారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే, పోలీసులు అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలని, ఇప్పటికే చెరుకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.మూడు కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరి క్వింటాకు రూ.2800 ధర ప్రకటించాలని, రైతులకు సిఎం జగన్ ధాన్యం కొనకుండా ద్రోహం చేయొద్దని కోరారు. అనంతరం రైతు సమస్యలను వివరిస్తూ కలెక్టరేట్ ఎఒ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అరెస్టు చేసిన నాయకులను మధ్యాహ్నం పోలీసులు విడిచిపెట్టారు.



**రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**

ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ. రైతుల సమస్యలు పరిష్కరించే చిత్తశుద్ధి లేక సమస్యలపై పోరాడే నాయకులను నిర్బంధించడం ప్రభుత్వ దుర్మార్గ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోత దశలో ఉండగా ధాన్యం సేకరణ కోసం ప్రభుత్వాన్ని ఏర్పాట్లు చేస్తుందని, ప్రభుత్వమే ధాన్యాన్ని రైతుల నుండి నేరుగా కొనడం జరుగుతుందని ప్రభుత్వం చెప్పే మాటలన్నీ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమని అన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వసతుల కల్పనకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని అన్నారు. మన్యం జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా వ్యవసాయానికి కావలసిన సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇటీవల కాలంలో అధిక వర్షాల వలన పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా క్వింటా ధాన్యానికి రూ2,800 చెల్లించాలన్నారు. ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని, పాలకొండ మండలంలో 27 సంవత్సరాలుగా పూర్తికాని జంపర్లకోట ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన సోనా మసూరి విత్తనాలు పంట దశలో చావు ఎన్ని వచ్చి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, పార్వతీపురం మండలం జగన్నాధపురం కష్ట పల్లి రైతుల వరి పంట నాశనం చేస్తున్న పందుల నివారించాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రశ్నించి రైతుల తరఫున పోరాడే రైతు సంఘం, గిరిజన సంఘం నాయకులను అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.మన్మధరావు, వెంకటస్వామి, బాలరాజు, సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

# అయ్యోర్రే!

- పార్ట్‌టైం టీచర్లతో బూట్లు శుభ్రం
- విద్యాశాఖ తీరుపై విమర్శలు



బూట్లు శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

**పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల చెప్పులు శుభ్రం చేస్తూ వాటిని మోస్తూ భద్రం చేస్తున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పాఠాలు బోధించి బోర్డు మీద అక్షరాలు రాయాల్సిన చేతులతో విద్యార్థులు కాళ్లకు తొడుక్కొని బూట్లను క్లీన్ చేసి భద్ర పర్చాల్సిన దుస్థితి రావడం విస్మయం కలిగిస్తోంది.**

విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో పార్ట్ టైం ఇనస్ట్రక్టర్లుగా క్రాఫ్ట్, డ్రాయింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వారు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు చెప్పాల్సింది పోయి, వారితో విద్యార్థుల కాళకు తొడుక్కునే బూట్లను తుడిపించి వాటిని శుభ్రం చేయించే బాధ్యతను విద్యాశాఖ అధికారులు అప్పగించారు. నగరంలోని ఆర్‌సిఎం హైస్కూలులో గురువారం వీరంతా విద్యార్థులకు సరఫరా అయిన బూట్లను శుభ్రం చేసే పని చేపట్టారు. అటువైపుగా వెళ్తున్న ప్రజాశక్తికి ఈ ఘటన కంటపడింది. మీరు ఈ పని చేయడమేమిటఅని ప్రశ్నిస్తే మాట్లాడేందుకు వెనుకంజ వేశారు. ఏమి చేస్తాం ఇది మా దుస్థితి అంటూ పెదవి విరిచారు. అధికారుల ఆదేశాలు ప్రకారం ఈ పని చేసినట్లు తెలిసింది.

# 17న చెరకు క్రషింగ్ ప్రారంభం

## ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషరెడ్డి



మాట్లాడుతున్న ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషరెడ్డి

ప్రజాశక్తి- రేగిడి

చెరకు టన్ను మద్దతు ధర రూ.2,980 చెల్లించనున్నామని సంకిలి ఇఐడి ప్యారీ షుగర్స్ అసోసియేట్ ఉపాధ్యక్షులు ఎ.నాగశేషరెడ్డి ప్రకటించారు. ఈ నెల 17న చెరకు క్రషింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. ఈ మేరకు గురువారం సంకిలి ప్యారి చక్కెర కర్మాగార సమావేశ మందిరంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 5,500 ఎకరాల మొక్క తోటలు, 8,350 ఎకరాలు మమ్ము తోటల పంటలకు సంబంధించి చెరకు క్రషింగ్ 5.85లక్షల మెట్రిక్ టన్నులు ఆడేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు పెట్టుబడి దృష్టిలో ఉంచుకొని భారీ రాయితీలు ప్రకటించామని చెప్పారు. 2022 అక్టోబర్ 1 నుంచి 2023 ఏప్రిల్ 30 మధ్యకాలంలో మామూలు పద్ధతిలో చెరకు నాటిన రైతులకు ఎకరానికి రూ.7వేలు, దూరపు చాళ్ళ పద్ధతిలో నాటే రైతులకు అధనంగా మరో వెయ్యి రూపాయలు కలుపుకొని రూ.8వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి రాయితీ పొందడానికి ఎకరానికి 29 టన్నులు చెరకు సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక రాయితీలో భాగంగా 25 టన్నుల చెరకు సరఫరా చేసిన రైతులకు 2024 జనవరి 16 నుండి 2024 ఫిబ్రవరి 28 వరకు టన్ను ఒక్కంటికి అధనంగా రూ.75 చెల్లిస్తామన్నారు. 2024 మార్చి 1 నుండి 2024 మార్చి 31 వరకు రూ.125 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి క్రషింగ్ పూర్తయ్యే వరకు చెరకు సరఫరా చేసే రైతులకు రూ.175 అధనంగా రాయితీలు ఇస్తామని అన్నారు. అయితే యాజమాన్యం ప్రకటించిన రాయితీలో 45 రోజులలో రూ.2,250 రాయితీ ఇస్తామని మిగిలిన రాయితీ రూ.5,750ను చెరకు పంట పూర్తిగా కర్మాగారానికి తరలించిన తరువాత దిగుబడి ప్రాప్తికి బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ క్రషింగ్ సీజన్‌కు రైతులు నాణ్యమైన చెరకు సరఫరా చేయాలని కోరారు. ఇప్పటికే తుని, అన్నవరం నుంచి 144 బంటాలను ఏర్పాటు చేశామన్నారు. లోకల్ పంటలు కూడా ఏర్పాటు చేశామన్నారు. దూరపు చాళ్ళల్లో నాటిన చెరుకు రైతులకు కట్టింగ్ చేసే యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. రానున్న చెరకు క్రషింగ్‌కు అధిక విస్తరణలో చెరుకు పంటలు పండించి, దిగుబడులు సాధించి, ఫ్యాక్టరీ అభివృద్ధికి రైతులు తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో కేన్ ఎంజిఎం రమేష్ కుమార్ రెడ్డి, ఎజిఎం కిల్లి అప్పారావు, ఫైనాన్షియల్ ఎన్. సింహాద్రి పాల్గొన్నారు.

# 13న ఎండిఎం కార్మికుల సంఘం జిల్లా మహాసభ




సాలూరు : మహాసభల కరపత్రాన్నివిడుదల చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - సీతానగరం

మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం 3వ జిల్లా మహాసభలు ఈనెల 13న సీతానగరం మండల కేంద్రంలో జరగనున్నాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాలు, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్‌ను పెంచాలని, ప్రతినెలా జీతాలు చెల్లించాలని, ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ బండను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రెండు జతలు చీరలు యూనిఫారమ్ గా ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భవిష్యత్తు పోరాట కార్యక్రమాలపై చర్చించడానికి ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మహాసభల్లో భాగంగా తొలుత సీతానగరంలో ర్యాలీ, అనంతరం మూడవ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల నుంచి కార్మికులు పాల్గొని జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

**సాలూరు** : ఈనెల 13న మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు ఎస్.జయమ్మ, గేదెల లక్ష్మీ కోరారు. గురువారం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ఛార్జీలు కనీసం రూ.20కు పెంచాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ పెంచాలని కోరారు. రెండు చీరలు యూనిఫాంగా ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న సీతానగరంలో జరుగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# అంబులెన్స్‌లోకి పాము

**గుమ్మలక్ష్మీపురం** : 104 అంబులెన్స్‌లోకి పాము చొరబడడంతో డ్రైవర్ భయంతో వాహ నాన్ని అదుపు చేయలేక విద్యుత్ స్తంభానికి ఢీకొన్న సంఘటన గుమ్మలక్ష్మీ పురంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గుమ్మలక్ష్మీపురం నుంచి ఒప్పంగిలో వైద్య శిబిరానికి 104 అంబులెన్స్ వెళ్తుండగా స్టీరింగ్ మీదకు పాము వచ్చింది. దీన్ని గమనించిన డ్రైవర్‌కు ఏం చేయాలో తెలియక వాహనాన్ని అదుపు చేసేలోపే సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమీపంలో ఉన్న స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సర్పంచ్ గౌరీ శంకర్రావు స్పందించి కొత్త స్తంభాన్ని వేయించి విద్యుత్ పునరుద్ధరింప చేశారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న 104 వాహనం



కలెక్టర్ నిశాంత్‌కుమార్ కు సమస్యను విన్నవిస్తున్న మిల్లరు

# ధాన్యం కొనుగోలుకు సహకరించాలి

**కలెక్టరేట్** : రైతు నుంచి ధాన్యం కొనుగోలుకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ మిల్లర్లను కోరారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు సమస్యలు తలెత్తకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పది లక్షల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నందు ఆర్‌బికెలకు సరఫరా చేయాలని అధికారును ఆదేశించారు. గత ఏడాది ధాన్యం కొనుగోలులో గన్ని బ్యాగులకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కొత్త కోట రమేష్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2019- 20 నాటి రవాణా ఛార్జీలు ప్రకారం చెల్లిస్తే గిట్టుబాటుకాదని వాసు ట్రాన్స్పోర్ట్ యజమాని తెలపగా ఇతర జిల్లాల్లో లారీ రవాణా ఛార్జీలు ఎంతమేరకు చెల్లిస్తున్నదీ పరిశీలించాలని ఆర్‌టిఒ ఎం.శశి కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవునాయక్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎం కృష్ణారావును సస్పెండ్ చేయాలి

- నిర్భయ, దిశ, ఫోక్సో చట్టాల కింద కేసులు నమోదు చేయాలి
- లేకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేపడతాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి, గిరిజన సంఘాల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

కురుకుట్టి విద్యార్థునిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం టి.కృష్ణారావును తక్షణమే సస్పెండ్ చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ఉన్నతాధికారులు హెచ్ఎం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఖండిస్తూ విద్యార్థి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు అధ్యక్షతన జరిపిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘాల నాయకులు మాట్లాడుతూ సాలూరు మండలం కురుకుట్టిలో గల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్ఎంను రాజకీయ నాయకుల అండదండలతో ఉన్నతాధికారులు కాపాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే భయబ్రాంతు లకు గురైన ఒక విద్యార్థి కూడా చదువు మానేసిన పరిస్థితి వాటిల్లిందన్నారు. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో గిరిజన బాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఎదురవుతుంద న్నారు ఎస్ఎఫ్ఐ పర్యటనలో బయటపడ్డ ఈ సంఘటనను కప్పిపుచ్చుడానికి ఉన్నతాధికారులు అనేక ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యార్థి, గిరిజన సంఘాలు విచారణ చేపట్టాలని అనేక రోజుల నుంచి డిమాండ్ చేపడుతుంటే నేటికి విచారణ చేపట్టి వారం రోజులైనా కమిటీ నివేదికను బయట పెట్టకపోవ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కృష్ణారావు, ఉన్నతాధికారులు విద్యార్థిని లపై అనేక బెదిరింపులకు పాల్పడిన ప్పటికీ వారు వాస్తవాలను కమిటీ ముందు ప్రవేశపెట్టారని, సాక్షాధారాలు బలంగా ఉండబట్టే హెచ్ఎంను కాపాడాలనే ప్రయత్నంలో భాగంగానే నివేదికను విడుదల చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. వెంటనే లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్ఎంను సస్పెండ్ చేయాలని, ఆర్డీవో సమక్షంలో చేపట్టిన విచారణ కమిటీ నివేదికను వెంటనే విడుదల చేయాలని, హెచ్‌ఎంపై నిర్భయ దిశ పోక్స్ చట్టాల కింద కేసు నమోదు చేయాలని, ప్రతి బాలికల పాఠశాలలలో మహిళా రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి రాజశేఖర్, మండల గర్ల్స్ కన్వీనర్ సిహెచ్ శిరీష, నాయకులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.టి.నాయుడు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు సీతారాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి రంజిత్, సాయి బాబా, గిరిజన సమైక్య సంఘం నాయకులు సీతారాం, గిరిజన యువజన సంఘం చిన్నారావు రైతు కూలీ సంఘం నాయకులు సీతారాం, కృష్ణ, ఎఐకెఎంఎస్ నాయకులు బొత్స నర్సింగరావు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# భూ హక్కు పత్రాల పంపిణీకి జాబితా

**కలెక్టరేట్** : జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాల పంపిణీకి జాబితాను సిద్ధం చేయాలని భూపరిపాలన ప్రధాన కమీషనర్ ( సిసిఎల్ఎ) జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రీసర్వే పురోగతి, జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాల మంజూరుకు చర్యలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జారీ చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాల్లో రీ సర్వే నిర్వహించాల్సిన మిగతా గ్రామాలలో త్వరితగతిన సర్వే పూర్తిచేసి భూహక్కు పత్రాల పంపిణీకి సిద్ధం చేయాలని చెప్పారు. మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

**రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలి**

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ భవనాలు, హెల్త్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, ఉపాధి హామీ, స్వచ్ఛ గ్రామాలు, జలజీవన్ మిషన్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలోని రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నం దున సంబంధించిన ప్రతిపాదనలను పంచాయితీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేసి పంపించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి భవన పనులు వేగవంతం అయ్యేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఒ. ఆనంద్, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఒప్రభాకర్, పంచాయతీ రాజ్ అధికారి కృష్ణాజి, తదితరులు పాల్గొన్నారు.

# హద్దు మీరి విమర్శలు చేస్తే కేసులు

- జనసేన తీరుపై డిప్యూటీ సిఎం ఆగ్రహం
- 100వ రోజుకు గడపగడపకు..



వెంకటబైరిపురంలో ని పర్యటిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

వైసిపి నాయకులపైనా, సర్పంచులపైనా హద్దులు దాటి విమర్శలు చేస్తున్న జనసేన నాయకులపై కేసులు పెట్టాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట బైరిపురం పంచాయతీలో గురువారం 100వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన నాయకుల విమర్శించే తీరు, వాడుకు భాష దారుణంగా ఉందన్నారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడకూడదని ఆయన పార్టీ శ్రేణులకు తెలిపారు. మండలంలో పెరిగిపోయిన చెత్త వీడియోలు తీసి డిప్యూటీ సిఎం సొంత మండలం తీరిదని ప్రచారం చేయడం దారుణన్నారు. స్థానికంగా చేయాల్సిన పనులు ఎమ్మెల్యేలకు, ఎంపిలకు, మంత్రులకు ఆపాదించడమేమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయా అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తొలుత 100వ రోజు గడపగడప కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సిఎంకు స్థానిక సర్పంచ్ ఎం.వెంకటరత్నం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం కేకు కట్ చేసి రాజన్నదొర గడపగడ కార్యక్రమాన్ని పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, మండల నాయకులు రంగు నాయుడు, ఎంపిడిఒ దేవకుమార్, సాలూరు సిఐ ధనుంజయరావు, మక్కువ ఎస్సై, వైసిపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జియ్యమ్మవలస** : మండలంలో నిమ్మలపాడులో గడపగడపకు కార్యక్రమం గురువారం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు వివరించారు. అలాగే గడపగడప కు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కారానికి అధికారులు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, ఎఎంసి డైరెక్టర్ ఎం.గౌరీశంకరరావు, బిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, ఎంపిటిసి సభ్యులు గుడివాడ సంపత్ కుమార్, సర్పంచ్ గుంట్రేడ్డి శ్రీనివాసరావు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీతంపేట** : మండలంలోని పెద్దూరు గ్రామ సచివాలయ పరిధిలో గల పెద్దూరు, పనుకువలస పంచాయతీల పరిధిలో గల పెద్దూరు, కారిగూడ, చింతమానుగూడ, వలసగూడ, అద్దాల మామిడి గూడ, కోడిగుడ్డిగూడ, బుగతగూడ, వలగెడ్డ, పాత పనుకువలస, డెప్పిగూడ, మర్రిగూడ, గాంధీగూడ, బొంగడిగూడ, జగ్గడు గూడ గ్రామాల్లో ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అద్దాలు మామిడి గూడలి, గాంధీ గూడ వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ కె.గీతాంజలి, తహశీల్దార్ ఎస్.నరసింహమూర్తి, కార్యదర్శి బి.సుదర్శన్, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కొత్త ఇళ్ల నిర్మాణమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో 2 వేల కొత్త ఇళ్ల నిర్మాణాలే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా మున్సిపాల్టీ పరిధిలోని జగనన్న లే అవుట్‌లో ఇంతవరకూ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఇంత వరకూ 3,133 ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తూ పట్టాలను రెండేళ్ల క్రితం అర్హులకు అందజేస్తామన్నారు. అందులో నర్సిపురం సమీపాన వేసిన లేఔట్ పట్టణానికి చాలా దూరంగా కొండ దగ్గర ఉన్నందున రాష్ట్రస్థాయి అధికారులతో, ఆనాడు సంబంధిత మంత్రులతో మాట్లాడి ఆ లేఔట్ రద్దు చేస్తామన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలో వేసిన లేఔట్లలో స్థలాల కొలతలు మళ్లీ వేయడం వల్ల మరో 555 ఇళ్ల పట్టాలు రద్దయ్యాయని అన్నారు. అయితే వీరందరికీ వేరేచోట ఇళ్ల పట్టాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వేసిన లేఔట్లలో ఇంతవరకూ ఇళ్లు కట్టని వారి స్థలాల్లో కొంతమంది ఇళ్లు కట్టుకున్నారని, ఇలా వారికి కేటాయించిన సైట్‌లో కాకుండా వేరే చోట ఇళ్లు కట్టుకున్న వారు 336 మంది ఉన్నారని అన్నారు. మున్సిపాల్టీలో 1895 ఇళ్లు మంజూరయ్యాని, అందులో ఇంతవరకు 794 ఇళ్లు మాత్రమే పునాది స్థాయి ఉన్నాయని, మిగిలిన 615 మంది లబ్దిదారులు ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదన్నారు. ఎవరైతే ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ముందుకొచ్చారో వారందరికీ ఎక్కడైతే జగనన్న లేఔట్లలో స్థలాలు ఖాళీగా ఉన్నాయో ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలని తెలిపారు. మంజూరైన ఇళ్లస్థలాలు అట్టిపెట్టుకొని అమ్ముకుంటామంటే కుదరదని, ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించి తీరాలని స్పష్టం చేశారు. అలా కాకుండా ఎవరైనా ఇళ్ల స్థలాలు ఉంచుకుంటామంటే కుదరదన్నారు. సమీక్షలో చైర్‌పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరావు, కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, హౌసింగ్ ఎఇ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

## పైపులైనుకు భూమి పూజ

**సీతానగరం:** మండలంలోని అంటిపేట గ్రామంలో జల జీవన మిషన్ పైపులైనులో భాగంగా ఇంటింటి కుళాయిల నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్యే జోగారావు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జలజీవన మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని ఉద్దేశంతో ఇంటింటి కుళాయి ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ పథకానికి రూ. 60 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్ మహేష్. ఎంపిటిసి సేనపతి నిర్మల, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సేనపతి తిరుపతిరావు, వైస్ ప్రెసిడెంట్ బొంగు తిరుపతిరావు, మాజీ జెడ్‌పిటిసి కృష్ణ నాయుడు, టి వెంకట అప్పలనాయుడు, జెడ్‌పిటిసి ఎం. బాబ్జి, ఎంపిపి బి. శ్రీరాములు నాయుడు, వైసిపి నాయకులు బి. చిట్టి రాజు, ఎం. ధనుంజయ, ఎన్. రామకృష్ణ, జి. అన్న నాయుడు, ఎం ముకుంద, బి. ముకుంద తదితరులు పాల్గొన్నారు.

**56 మందికి పట్టాలు పంపిణీ**

మండలంలోని చల్లంనాయుడు వలసలో గురువారం 56 మంది పేదలకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇల్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికీ ఇంటి స్థలం అందిస్తున్నామన్నారు. ప్రతి పేదవానికి జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణం చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి. అప్పమ్మ, మాజీ సర్పంచ్ పారినాయుడు, డిటి సెట్ హెబ్రం, ఎంపిడిఒ బి. కృష్ణమహేశ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## మరిశర్ల కుటుంబానికి పరామర్శ

**గుమ్మలక్ష్మీపురం :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖాదీ బోర్డు మాజీ చైర్మన్ మరిశర్ల శివున్నాయుడు సతీమణి మరిశర్ల రమణమ్మ విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం కురుపాం నియోజకవర్గ ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి రమణమ్మ కుమారుడైన జిల్లా వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడును పరామర్శించారు. రమణమ్మ మృతి చెందిన బాధాకరమన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగుదేశం అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు పల్ల రాంబాబు, మధుసూదనరావు, గంగాధర నాయుడు, సత్యంనాయుడు, కోట సుమన్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## గిరిజన గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు



మందులను పంపిణీ చేస్తున్న ఎంపిటిసి మల్లేశ్వరరావు

**గుమ్మలక్ష్మీపురం:** గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇరిడి ఎంపిటిసి సభ్యులు కె.మల్లేశ్వరరావు కోరారు. మండలంలోని గుణద, నోంద్రుకోన, తోలుఖర్జ, గుణద గ్రామాల్లో గురువారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు లక్ష్మణరావు మాట్లాడుతూ శీతకాలంలో పశువులకు, జీవాలకు లంపిస్కిన్, జలుబు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రైతులంతా పశువులకు టీకాలు వేసుకోవాలని కోరారు. ఇంకా అవసరం మేర గ్రామల్లో హెల్త్ క్యాంప్‌లు పెట్టడం జరుగుతుందన్నారు. ఏమైనా పశువులు ఆరోగ్యం బాగోలేకపోయినా తమకు తెలియజేయాలని అన్నారు.

## 142 పనుల గుర్తింపు

**గుమ్మలక్ష్మీపురం :** మండలంలోని ఇరిడి గ్రామ పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులు చేపట్టిందకు గ్రామసభ నిర్వహించినట్లు ఎపిఒ శివరామకృష్ణ తెలిపారు. అవసరమైన మేరకు గ్రామస్తుల ఆమోదంతో సుమారు రూ.2.09 కోట్లకు సంబంధించిన 142 పనులు గుర్తించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెఇ మనోజ్ కుమార్, సర్పంచ్ వాసుదేవరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## విరిగి పడిన విద్యుత్తు స్తంభం

**పార్వతీపురంరూరల్ :** పట్టణ శివారులో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశమైన వెంకంపేట ఘోరీలు జంక్షన్ ఒకటి. అయితే గురువారం మధ్యాహ్నం కూడలిలో ఉన్న ఒక పాత విద్యుత్ స్తంభం విరిగి రోడ్‌పై పడిపోవడంతో జనం భయంతో పరుగులు తీశారు. అయితే ఆ సమయంలో వాహనాలుగానీ, పాదాచారులుగానీ దగ్గరలో లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి నష్టం కలగలేదు. హఠాత్పరిణామంలో భీతిల్లిన పరిసర ప్రాంత దుకాణదారులు, వాహనదారులు పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

## ఏనుగుల ప్రమాదం లేకుండా అప్రమత్తం

**కలెక్టరేట్ :** ఏనుగుల వల్ల ప్రజలకు ఎటువంటి ప్రమాదం లేకుండా అప్రమత్త చర్యలు తీసుకుంటున్నామని అటవీ పరిధి అధికారి పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుగులు సంచరిస్తున్న పరిసర గ్రామాల్లో ముందుగానే దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. అటవీ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్, బేస్ కేంప్ వాచర్లు ఒక గ్రూపుగా ఏర్పడి ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**వీరఘట్టం :** మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఎఇ బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టంతోపాటు నడుకూరు, చిట్టిపూడి వలస, కంబరవలస, కంబర, నడిమికెల్ల, కడకల్ల, విక్రంపురం గ్రామాలకు మెయింటినెన్స్ కింద ఉదయం 9 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు.

## రైతులకు ఉపకరణాలు పంపిణీ

**కురుపాం :** గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు గురువారం రస్తా కుంటుబాయి కెవికెలో ఉపకరణాలను శాస్త్రవేత్తలు పంపిణీ చేశారు. మహిళలకు కుట్టుమిషన్లు, గిరిజన రైతులకు స్ప్రేయర్లు, డ్రమ్స్, టారబెన్లు, తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త టిఎస్ఎస్‌కె పాత్రో, శాస్త్రవేత్తలు సౌజన్య, శ్రీనివాసరాజు, అమృతవీణ, స్రవంతి, అను, ఉమాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## 16న తూరాయిపువలసలో వేలం

**సీతంపేట :** మండలంలో తూరాయిపు వలసలో ఉన్న హెచ్ఎన్‌టి ఫారంను 16వ తేదీన వేలం పాట నిరసిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ బి. నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడ కాపుకాసిన జామి, కొబ్బరి జీడి, సపోటా తదితర పంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధారధత్వం కోసం రూ.25వేలు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9492422806 ఈ నెంబర్ సంప్రదించాలని కోరారు.

## సేవకులకు టీషర్టులు అందజేత

**డెంకాడ :** మండలంలోని మోదవలసలో జరిగిన బంగారమ్మ తల్లి పండగలో సేవకులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా టీషర్టులను అందజేశారు. ఈ టీషర్టలను విజయనగరానికి చెందిన ఎర్నింటి కృష్ణ (కిట్టు) వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకల రామారావు, బోని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**సీతంపేట :** మండలంలో కేసర్ జోడు పంచాయతీ దిబ్బగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన డిపిఎం షణ్ముఖ రాజు కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై వచ్చిన లాభాలు గురించి రైతులకు తెలియజేశారు. అరటిపండు పంటపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయరావు, శ్రీనివాసరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదు

ప్రజాశక్తి - కొమరాడ

అధికార వైసిపి నాయకులు తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని టిడిపి యువ నాయకులు నిరస శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక విలేకరలుతో ఆయన మాట్లాడూత తామంతా ప్రభుత్వ చెరువులను కబ్జా చేస్తున్నట్టు వైసిపి నాయకులు తప్పుడు ప్రకటనలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తమ తాత, ముత్తాతల నుంచి తమ భూముల తాము సాగు చేసుకుంటే ఇప్పుడు ఓర్వలేని అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రకటనలు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా చేస్తే రెవెన్యూ అధికారులు ఎందుకు చూసీ చూడనట్లు వ్యవహరిస్తారని ప్రశ్నించారు. కాబట్టి తమపై తప్పుడు ప్రకటనలు చేసిన వారిపై పరువు నష్టం కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు

## 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

**వీరఘట్టం :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య అధికారి జి ప్రదీప్ కుమారు 35 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహం, బరువు, ఎత్తు, తదితరమైన పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, శాంత కుమారి, నవోనమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

## తామరకుంట్లలో పారిశుధ్య పనులు

**సీతానగరం :** మండలంలోని గురువారం తామర కండి గ్రామంలో సర్పంచ్ ఎం. లలిత వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని కాలువలలో మురుగునీరు తొలగించి డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించామన్నారు. దోమలు పోవడానికి కాలువల్లో స్ప్రే చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులు చేస్తున్న సిబ్బంది

## 13న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల మహాసభ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల 3వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని మున్సిపల్ పారిశుధ్య, కాంట్రాక్ట్ వర్కర్ పట్టణ అధ్యక్షులు సిహెచ్ సింహాచలం సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 13న పాలకొండ కోట దుర్గ కలింగ కోమటి కల్యాణ మండపంలో జరుగు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభ ఉపయోగపడుతుందని, కార్మికులు పోరాడి తెచ్చుకున్న హెల్త్ అలవెన్స్ రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రకటన రద్దు జరిగేలా మరో పోరాటం జరిగిందని అందులో భాగంగా ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ రికవరీ విధానాన్ని రద్దు పర్చుకుందని అన్నారు. కార్యక్రమంలో గంగయ్య, రాజేష్, జె.సత్తిరాజు, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆశాల హక్కుల కోసం ఉద్యమం

**కురుపాం :** ఆశా వర్కర్ల హక్కుల సాధనకు కోసం ఆశాలంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపుని చ్చారు. మండలంలోని మొండెంఖల్‌లో ఆశా వర్కర్ల మండల అధ్యక్షులు బి.సరోజినీ అధ్యక్షతన జరిగిన ఆశా వర్కర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాలు ఆశా వర్కర్ల హక్కులను కాల రాస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో గర్భిణీకి ఆసుపత్రికి తీసుకొచ్చి నుంచి తల్లీబిడ్డలను ఇంటికి చేర్చే వరకూ ఆశా వర్కర్లే కష్టమేనని అన్నారు. అటువంటిది వారికి జీతాలు సక్రమంగా అందకపోవడమే కాకుండా హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. కావున హక్కుల సాధన కోసం ఆశాలంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోలక అవినాస్, మండలంలో గల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వి. ఇందిర

## వసతి గృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ గురువారం పాలకొండ పట్టణంలో గల సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వివరించారు. వసతిగృహ సంక్షేమ అధికారులకు మెను ఖచ్చితంగా అమలు చేయమని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపమని ఆదేశించారు. ఈయనతో పాటు ఎఎస్‌డబ్ల్యుఒ శశిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ గోపినాథ్ తదితరులున్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న మహమ్మద్ గయాజుద్దీన్

## రూ.3.74 కోట్లతో ఉపాధి పనులు

**వీరఘట్టం :** 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థానిక మేజర్ పంచాయతీలో 3.74కోట్లతో ఉపాధి పనులను గుర్తించామని ఎపిఒ జి. సత్యంనాయుడు అన్నారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేతనదారులు ఏడు గంటల పనిచేస్తే స్త్రీ, పురుషులకు సమాన వేతనం ఇస్తారని చెప్పారు. రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. చేసిన పనికి వేతనం తప్ప మరి ఏ విధమైన అలవెన్సులు ఉండవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి. గౌరమ్మ, మాచర్ల మహేష్, వెంకటరమణ, ఉదయాన సూరి నారాయణ, మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి రామచంద్రరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పనుల్లో పురోగతి కనిపించాలి

**వీరఘట్టం :** మండలంలో రెండో విడత కింద పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు అభివృద్ధి పనుల్లో భాగంగా పనుల్లో పురోగతి కనిపించాలని ఎంపిడిఒ ఏ. ప్రభాకర్ రావు ఇంజనీరింగ్ సహాయకులకు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకుల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాణ్యత ప్రమాణం కూడా పాటించే విధంగా పనులు చేపట్టాలన్నారు. త్వరితగతిన పనులు వేగవంతం చేసేందుకు సాయి శక్తులు కృషి చేయాలన్నారు. మండలంలో జరుగుతున్న సచివాలయాలు, రైతు భరోసా, వెల్నెస్ సెంటర్ డిజిటల్ లైబ్రరీల పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో మండల ఇంజనీరు డి. కళ్యాణదుర్గ, సర్వశిక్ష అభియాన్ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను జయప్రదం చేయండి

**పాలకొండ రూరల్ :** కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా 6వ మహాసభలు ఈ నెల 12వ తేదీన పలాసలో జరుగుతాయని, ఈ సభలను విజయవంతం చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్లబారికి గురుమూర్తి అన్నారు. గురువారం ఇందుకు సంబంధించి చిన మంగళాపురం గ్రామంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లా వాసులపై పాలకులు చూపిస్తున్న వివక్షతను ప్రజలకు హానికరమైన పరిశ్రమలు ఏర్పాటుకు తీసుకుంటున్న నిర్ణయాలను ఈ మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, దేవి, గాంధీ, అసిరయ్య, ఆనందరావు తదితరులున్నారు.

## పంపు హౌస్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలం లోని లక్ష్మీపురం మంచినీటి పంపు హౌస్ పనులను ఎంపిడిఒ బి. కృష్ణ మహేశ్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపు హౌస్‌లో నీటిని శుద్ధి చేసేందుకు క్లోరినేషన్ గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేశామని వీటి కారణంగా ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వీటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. వాలంటీర్లకు అప్పగించిన 50 కుటుంబాల పూర్తి వివరాలను కంప్యూటర్ చేయాలని ఎవరు అశ్రద్ధ చేయొద్దని తెలిపారు. ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి కేకే వర్మ, పంచాయతీ కార్యదర్శి పి. వెంకట నాయుడు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి

## 132 మందికి కంటి పరీక్షలు

**వీరఘట్టం :** మండల పరిధిలోని వండువ గ్రామ జంక్షన్ వద్ద గల శిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆప్తాల్మిక అధికారి కే. శ్రీకాంత్ 132 మందికి నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సల కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, సిబ్బందితోపాటు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేసున్న వైద్యుడు

## బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపిడిఒ డొంక త్రినాధులు అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో విలేజ్ రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్ సహాయకులు, ఇంజనీరింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠాల సర్వే సక్రమంగా చేపట్టాలని, అందరూ సమన్వయంతో పనిచేసి ఈ సర్వే పక్కాగా జరిగేలా చూడాలని సూచించారు. సర్వే జరిగే టప్పుడు రైతులకు ఎటువంటి సందేహం వచ్చినా వెంటనే పరిష్కరించేలా ఉండాలన్నారు. దీనికి సమన్వయం అవసరమన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సత్యం, ఆర్ఐ పుష్ప, మండల సర్వేయర్ వెంకటరావు ఉన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పాలకొండ

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర పంచాయతీ కమిషనర్ పివివిడి ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలో పలు వీధుల్లో ఆయన పర్యటించారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా మూడు చెత్త బుట్టల విధానం కచ్చితంగా అమలు చేయాలన్నారు. దోమలు నియంత్రణపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కాలువల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. అనంతరం కోటదుర్గ ఆలయ సచివాలయాన్ని సందర్శించి అక్కడ రికార్డులు పరిశీలించారు. బయోమెట్రిక్, హాజరు పరిశీలించారు. ప్రజలకు సక్రమంగా సేవలందించాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాద్

## ప్రారంభమైన వరి కోతలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుడ్డిపేట, లక్ష్మీపురం, నడగల్లు, సుమిత్రాపురం, పెదలంకలో గ్రామాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే తుఫాను నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి కోసిన తరువాత వర్షాలు పడితే ఇబ్బందేనని రైతులు చెబుతున్నారు.



కోతల్లో నిమగ్నమైన రైతులు

## ఉత్తీర్ణతపై దృష్టిసారించాలి

**గుమ్మలక్ష్మీపురం:** నూరుశాతం ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులు దృష్టిసారించి ప్రత్యేక తరగతుల బోధన చేయాలని పాలకొండ డిప్యూటీ డిఇఒ విజయ కుమారి సూచించారు. మండలంలోని కస్తూరిబా పాఠశాల, గుమ్మలక్ష్మీపురం బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యా బోధన చేయాలని అన్నారు. జరిగిన పాఠ్యాంశాలపై వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

## తాగొద్దన్నందుకు బామ్మర్దిని కొట్టిన బావ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన రెడ్డి రాము తన వంగర మండలం వివిఆర్‌పేటకు చెందిన తన బావమరిది పాలక వినోద్‌ను తాగొద్దన్నందుకు రాముపై దాడికి పాల్పడ్డాడు. స్థానిక జిల్లా ఆస్పత్రి పోలీసుల కథనం ప్రకారం వినోద్ రోజూ మద్యం సేవిస్తూ రాము సోదరిని, పిల్లలను వేధిస్తున్నాడు. ఈ విషయంపై స్పందించిన రాము తన బావకు ఇలా ప్రవర్తించడం తప్పని హితవు పలకడంతో కోపోద్రిక్తుడైన వినోద్ విచక్షణారహితం కర్రతో దాడిచేసి గాయపరిచాడు. వెంటనే స్పందించిన స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రామును తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

## నేరాలు ఘోరాలు

## నాటుబళ్లను ఢీకొన్న లారీ ; 2 పశువులు మృతి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని కారాడవలస దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతానగరం నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న లారీ మూడు ఇసుక బళ్లను ఢీకొనడంతో ముగ్గురుకు గాయాలవ్వగా, ఈప్రమాదంలో రెండు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. గాయపడిన కారాడవలసకు చెందిన పిన్నింటి సాంబయ్య, దొగ్గ తిరుపతి, రమేష్‌ను స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రామభద్రపురం నుంచి కూనేరు వెళ్లే రహదారి ఇరుగ్గా మారడంతో తరచూ ఇసుకతోలుకునేందుకు వెళ్లే కూలీలు, పశువులు తరచూ ఈ ప్రమాదానికి గురవుతున్న దృష్ట్యా పోలీసులు, ఆర్ అండ్‌బి అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళకు పాము కాటు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

కొమరాడ మండలం శివినికి చెందిన అధికారి నీలవేణి గురువారం వరికోతలకు కూలీపనుల నిమిత్తం వెళ్లింది. కోత కోస్తుండగా గుర్తుతెలియని పాము కరవడంతో అపస్మారక స్థితిలోకి ఆమె వెళ్లిపోయింది. స్పందించిన స్థానికులు, కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యంకోసం విశాఖ పట్నం కెజిహెచ్‌కు తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.



పాముకాటుకు గురైన నీలవేణి